తీరం.. భక్తజన సంద్రం

- సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు
- ఘనంగా మహాశివరాత్రి పూజలు


జోడుగుళ్లపాలెంలో శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు


జోడుగుళ్లపాలెం తీరంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు


అప్పుఘర్ తీరంలో సముద్ర స్నానమాచరిస్తున్న భక్తులు

ఆరిలోవ: విశాఖ సాగర తీరం.. భక్తుల పుణ్యస్నానాలతో జనసంద్రంగా మారింది. మహాశివరాత్రి పూజలు, జాగరణ చేసిన అనంతరం భక్తులు సముద్ర స్నానాలు చేశారు. దీంతో ఆదివారం వేకువ జాము నుంచి సముద్ర తీరం భక్తజనంతో పోటెత్తింది. జోడుగుళ్లపాలెం నుంచి సీతకొండ వరకు తీరంలో సందడి నెలకొంది. ఆరిలోవ, ఆదర్శనగర్, రవీంద్రనగర్, డెయిరీ ఫారం, పెదగదిలి, చినగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం తోపాటు సింహాచలం, అడవివరం, వేపగుంట, పెందుర్తి తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఈ తీరానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అక్కడి ఏడుగురు అమ్మవార్ల గుడిలో పూజలు చేశారు. జోడుగుళ్లపాలెం, సీతకొండ మలుపు సమీపంలో ఉన్న శివలింగాలను భక్తులు దర్శించుకున్నారు. భక్తులు సముద్రంలో లోకి వెళ్లకుండా ఆరిలోవ పోలీసులు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లను పడవల్లో కెరటాలకు కొంత దూరంలో నీటిలో సిద్ధంగా ఉంచారు.


ప్రత్యేక అలంకరణలో పార్వతీముక్తేశ్వరుడు

ప్రసాద వితరణ..

స్నానాలకు వచ్చిన భక్తులకు వైఎస్సార్‌సీపీ, టీడీపీ స్థానిక నాయకులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రసాదాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన టెంట్ వద్ద పార్టీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ స్వాతి భక్తులకు పులిహోరా, శనగలు, అరటిపళ్లు అందజేశారు. ఏడుగురు అమ్మవార్ల గుడుల వద్ద నిర్వాహకులు భక్తులకు పులిహోరా అందించారు.

కిటకిటలాడిన అప్పుఘర్ తీరం


ఎంవీపీ కాలనీ: మహాశివరాత్రి పుణ్యస్నానాలకు తరలివచ్చిన భక్తులతో అప్పుఘర్ తీరం కిటకిటలాడింది. ఎంవీపీ కాలనీతోపాటు నగరంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. శివరాత్రి జాగారం నిర్వహించిన వారు ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తుల తాకిడికి అనుగుణంగా జీవీఎంసీ, పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక గదులతోపాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచింది. పుణ్యస్నానాల అనంతరం భక్తులు అప్పుఘర్‌లోని శ్రీ సాగర లింగేశ్వరుడిని, సెక్టార్-6లోని సిద్ధివినాయక పార్వతీ ముక్తీశ్వరాలయంలో కొలువైన నీలకంఠుడిని భారీగా దర్శించుకున్నారు. ప్రత్యేక అలంకరణలో పార్వతీ ముక్తేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చాడు. అప్పుఘర్ తీరంలో భక్తులకు వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, పార్టీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అల్పాహారం అందజేశారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు


శివాలయంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆరిలోవ: మహాశివరాత్రి సందర్భంగా తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని శివాలయంలో జాగరణ భక్తుల కోసం శనివారం అర్ధరాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చందన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన కూచిడి నృత్యం ఆకట్టుకుంది. సుమారు 70 మంది చిన్నారులతో కూచిపూడి నృత్యాలు నిర్వహించనట్లు అకాడమీ నిర్వాహకురాలు నాగ చందన తెలిపారు. చిన్నారులను భక్తులు, శివాలయం నిర్వాహకులు అభినందించారు.

ఘనంగా వారాంతపు పూజలు



కొమ్మాది: సాగర్ నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా శ్రీ రాధాదామోదరరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు నిర్వహించారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తులకు ప్రసాదం పంపిణీ

బీచ్‌రోడ్డు: మహాశివరాత్రి పుణ్యస్నానాలు ఆచరించేందుకు సాగర తీరానికి వచ్చిన భక్తులకు 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


భక్తులకు ప్రసాదం అందిస్తున్న అక్కరమాని విజయనిర్మల

క్లుప్తంగా

మేధావులకు పుట్టినిల్లు భారతదేశం

బీచ్‌రోడ్డు: మేధావులకు పుట్టినిల్లు భారతదేశమని.. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీలకు సీఈవోలు, సీఎండీలుగా భారతీయులే ఉన్నారని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఎక్సెల్లా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్లోబల్ స్టడీ అబ్రాడ్ సమ్మిట్‌ను ఆయన ప్రారంభించారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లి.. అక్కడ నేర్చుకుని.. సంపాదించుకుని.. తిరిగి భారతదేశానికి ఆ ఫలాలను అందించాలన్నారు. విదేశీ యూనివర్సిటీల కోసం పూర్తిగా తెలుసుకోకపోతే.. మోసపోతారని హెచ్చరించారు. ఎక్సెల్లా విశాఖ హెడ్ శేఖర్ మాట్లాడుతూ ఈ సమ్మిట్‌లో 13 దేశాలకు చెందిన యూనివర్సిటీలు పాల్గొన్నట్లు చెప్పారు. ఎక్సెల్లా అధినేత అరవింద్ అరసవల్లి తదితరుల పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు ఆదివారంతో 687వ రోజుకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నాయకులు దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రెసిడెంట్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగ సంస్థ గానే కొనసాగాలన్నారు. అంత వరకు ఈ దీక్ష సాగిస్తామని తెలిపారు. దీక్షా శిబిరంలో జిల్లా జనరల్ సెక్రటరీ బి.నాగభూషణం, ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు, సూరప్పుడు తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం సందర్శన


వసతి గృహంలో ఆహారాన్ని పరిశీలిస్తున్న బులికృష్ణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాన్ని ఆదివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ సందర్శించారు. అక్కడి వసతులను, బాలికలకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా ఆయన పరిశీలించారు. హాస్టల్ సంక్షేమ అధికారి గిరీశ్వరి, పారాలీగల్ వలంటీర్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్‌ఐ గౌరి

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో మహిళా ఎస్‌ఐ గౌరి కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి దినచర్య, సత్ప్రవర్తనతో కలిగి ఉంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పలు కేసుల్లో ఉన్న వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు, గొడవలు చేయకుండా ఉండాలన్నారు. హద్దు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి వినతి

ఎంవీపీకాలనీ: విశాఖలోని మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని తీరప్రాంత వాడబలిజ మత్స్యకారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలోని నివాసంలో రాష్ట్ర మత్స్యకార శాఖ మంత్రి సీదిరి అప్పలరాజుతో సమావేశమై వినతిపత్రం అందజేశారు. వాడబలిజ కులస్తుల కోసం మత్స్యకార భవన నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా స్థలం ఇప్పించాలని, రాష్ట్రంలో మత్స్యకార శాఖ ద్వారా నిర్వహిస్తున్న వాసవానిపాలెంలోని ఏకైక ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన మేరకు ఉపాధ్యాయులను నియమించాలని వారు విజ్ఞప్తి చేశారు. వాడబలిజలకు సైతం నామినేటెడ్ పదవులు దక్కేలా కృషి చేయాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి మంత్రి సీదిరి హామీ ఇచ్చినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. త్వరలో విశాఖలో మత్స్యకార సంఘాలతో ప్రత్యేక సమావేశం సైతం నిర్వహిస్తామని పేర్కొన్నట్లు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ అధ్యక్షుడు మూగి శ్రీరామూర్తి, ప్రధాన కార్యదర్శి గండిపిల్ల రామకృష్ణ, కోశాధికారి పేర్ల భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జానకీరామ్ తదితరులు ఉన్నారు.


మంత్రి సీదిరి అప్పలరాజుతో సమావేశమైన సంఘ ప్రతినిధులు

ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి వితరణ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి రాష్ట్ర భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆదివారం నిత్యావసర సరకులు, సామగ్రి అందజేశారు. ఇక్కడ ఉన్న అనాథ పిల్లలకు ఉపయోగపడే వస్తువులు అందించిన అధికారులకు ఆశ్రమ స్వామీజీ సౌమ్యానంద అవధూత కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ మాట్లాతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఓర్పు, సహనంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ నారాయణ, మధురవాడ సబ్ రిజిస్ట్రార్ మోహనరావు, విశాఖ సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర సరకులు, సామగ్రి అందిస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు

కంబాలకొండలో ఆట పరికరాలకు రంగులు



కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో రంగులు వేసిన ఆట పరికరాలు

ఆరిలోవ: కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలకు ఇటీవల అధికారులు రంగులు వేయించారు. సుమారు ఐదేళ్ల కిందట ఇక్కడ ఏర్పాటు చేసిన ఆట పరికరాలు తుప్పుపట్టిపోయాయి. వాటిలో కొన్ని విరిగిపోయాయి.

ఇటీవల కంబాలకొండ పార్కును సందర్శించిన అటవీ శాఖ పీసీసీఎఫ్ మధుసూదనరెడ్డి వీటిని బాగు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో అటవీ శాఖ అధికారులు ఇక్కడ ఆట పరికరాలను బాగుచేయించారు. తుప్పు పట్టి, విరిగిపోయిన వాటికి వెల్డింగ్‌లు చేయించారు. అనంతరం ఇక్కడ ఉన్న ఊయలలు, జారుడు బల్లలు, రంగుల రాట్నం, తూగుడు బల్లలు తదితర అన్ని ఆట పరికరాలకు రంగులు వేశారు. దీంతో ఈ పరికరాలు పిల్లలను ఆకర్శిస్తున్నాయి.

చిత్ర పరిశ్రమకు నిఘంటువు విశ్వనాథ్

సీతంపేట: కళాతపస్వి కె.విశ్వనాథ్ 93వ జయంతి వేడుకలు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. ముందుగా తారకరత్న మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందిన స్వాతిముత్యం, సిరివెన్నెల సినిమాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన ఎం.వి.రఘును ఈ సందర్భంగా సత్కరించారు. అతిథిగా సీనియర్ నటుడు ఎస్.కె.మిశ్రో మాట్లాడుతూ విశ్వనాథ్‌తో జ్ఞాపకాలను, ఆయన దర్శకత్వంలోని సాగర సంగమం, సిరివెన్నెల చిత్రాల్లో నటించానని గుర్తుచేశారు. ఎం.వి.రఘు మాట్లాడుతూ చిత్ర పరిశ్రమకు కె.విశ్వనాథ్ ఒక నిఘంటువని పేర్కొన్నారు. నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన, క్లుప్తత, స్పష్టత గుణాలను ఆయన నుంచి నేర్చుకున్నానన్నారు. సొసైటీ కార్యదర్శి ప్రకాశరావు మాట్లాడుతూ త్వరలో విశ్వనాథ్ ఫిల్మ్ ఫెస్టివల్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించే ఆలోచన ఉన్నానమన్నారు. అనంతరం స్వాతిముత్యం సినిమాను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, బి.చిన్నారావు, కాశీ విశ్వేశ్వరరావు, డాక్టర్ బాబ్జీ పాల్గొన్నారు.


కళాతపస్వి కె.విశ్వనాథ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

ఎర్త్ మూవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మధురవాడ: బక్కన్నపాలెం చెరువు సమీపంలో మధురవాడ శ్రీ దుర్గాలమ్మ ఎర్త్ మూవర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్‌బాడీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సంఘ కార్యకాలాపాలు సమీక్షించుకుని నూతన కార్యవర్గాన్ని ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నుకున్నారు. ఓనర్స్ సంక్షేమమే ధ్యేయంగా సంఘం పనిచేయాలని పెద్దలు సూచించారు. మరింత ఐక్యమత్యంగా ఉండాలని, సమస్యలు పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలపై తీర్మాణాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోతిన సత్యనారాయణ(నాయుడు), ఉపాధ్యక్షుడుగా టి. వెంకటరావు, సెక్రటరీగా సీహెచ్ శ్రీనివాసరావు, కోశాధికారిగా పోతిన బాస్కర్, జాయింట్ సెక్రటరీ జె. సాయి కుమార్ ఇతర కార్యవర్గ సభ్యులుగా ఎస్. నాగభూషణం, జి.గోవిందరావు, ఇ. వెంకటేష్, రామారావు, వెంకట్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో ఉషా, ఛాయా సూర్యనారాయణమూర్తి

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో మాఘమాసం ఐదవ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు ప్రత్యేకంగా గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం మందార, చామంతి, గులాబి పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఉషా, ఛాయా సమేత సూర్యనారాయణస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.

స్వాతిముత్యం సినిమా ఎన్నటికీ ఆణిముత్యమే

ఆ చిత్ర సినిమాటోగ్రాఫర్ రఘు


మాట్లాడుతున్న సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు

ఏయూక్యాంపస్: తెలుగు సినీ చరిత్రలో స్వాతిముత్యం సినిమా ఒక ఆణిముత్యంగా నిలిచిపోతుందని సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు అన్నారు. స్వాతిముత్యం విడుదలై 37 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన రఘుతో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏయూ హిందీ భవన్‌లో ఇష్టాగోష్టి నిర్వహించారు. ముందుగా సినీ నటుడు తారకరత్న మరణానికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. అనంతరం ఎం.వి.రఘు మాట్లాడుతూ చిత్ర నిర్మాణంలో దర్శకేంద్రుడు కె.విశ్వనాథ్‌తో పనిచేసిన సందర్భం, సంఘటనలను వివరించారు. విశ్వనాథ్ దర్శకత్వం, ఇళయ రాజా సంగీతం సినిమాకు ప్రాణం పోశాయన్నారు. విశ్వనాథ్ ఆలోచన విధానంతో ఈ చిత్రాన్ని ఒక కళాఖండంగా తీర్చిదిద్దడంలో తన పాత్ర కూడా ఉండటంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తెలుగు సినిమా ఉన్నంత కాలం ఈ సినిమా ప్రజలకు గుర్తుంటుందన్నారు. వయసుతో సంబంధం లేకుండా, అందరూ చూడదగిన సినిమాగా స్వాతిముత్యం ఉంటుందన్నారు. దక్షిణ భారత దేశంలో తొలి సారిగా ఆస్కార్‌కు పంపిన ఈ సినిమా ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. విశ్వనాథ్‌తో తరువాత సిరివెన్నెల సినిమాలో పనిచేయడం గొప్ప అనుభూతి కలిగిందన్నారు. ఆయన మరణం తెలుగు సినిమా పరిశ్రమకు తీరని లోటని చెప్పారు. విలేకరుల సమావేశంలో వీఎఫ్ఎస్ అధ్యక్షుడు ఆచార్య ఎస్.ఎ.డి పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు, సహాయ కార్యదర్శి బి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన సేవా సంస్థ ప్రారంభం

దాబాగార్డెన్స్: విశాఖపట్నం నార్త్ ఈస్ట్ డైమండ్స్ లయన్స్ క్లబ్ నూతన సేవా సంస్థ ఆదివారం ప్రారంభమైంది. అధ్యక్షునిగా కంకటాల సతీష్, కార్యదర్శిగా మామిడి ప్రకాష్, కోశాధికారిగా కె. శ్రీలక్ష్మిచే ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ గవర్నర్ ఎం. ఉషారాజు ఎన్నికైన సభ్యులు నియమ నిబంధనలు పాటిస్తూ సేవా కర్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ. గోపాలరావు, సీహెచ్ కృష్ణమూర్తి, వి. సాయినిర్మల, సీహెచ్ చందన, పద్మజ, టి. ఉషశ్రీ, ఎస్. సోమరాజు, సీహెచ్ కాశీ విశ్వనాథ్, ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

నల్ల హంసల కనువిందు


జూ పార్కు కొలనులో హుషారుగా తిరుగుతున్న నల్ల హంసలు



- జూ కొలనులో హుషారుగా షికారు
- సందర్శకులను అలరిస్తున్న అందమైన పక్షులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో నల్ల హంసలు సందర్శకులను అలరిస్తున్నాయి. జూ ప్రధాన ద్వారం నుంచి లోపలకు ప్రవేశించగానే ఎదురుగా హంసల కొలను ఉంది. ఇక్కడ గతంలో ఉన్న తెల్ల హంసలు మృతి చెందడంతో వేరే రాష్ట్రంలోని జూ పార్కు నుంచి సుమారు నాలుగేళ్ల కిందట రెండు జతల నల్ల హంసలను తీసుకొచ్చారు. ఇప్పుడు వాటి సంతతి 8కి పెరిగింది. ఈ హంసలు కొలనులో రోజూ హుషారుగా షికారు చేస్తూ సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. జూ యానిమల్ కీపర్లు ఈ కొలనులోనే వేర్వేరు రకాల గింజలు వేస్తుంటారు. వాటిని హంసలు తినడానికి పోటీపడుతుంటాయి. నీటిలో తేలుతున్న గింజలు తినడానికి వేగంగా ఈతకొడుతూ వాటి వద్దకు చేరుతుంటాయి. అడుగున చేరిన గింజలు తినడానికి కాళ్లు పైకి లేపి వాటి పొడవైన మెడను నీటి అడుగు భాగంలోకి దూర్చుతాయి. కొలనులో ఈ అందమైన పక్షులు చేస్తున్న విన్యాసాలను చూస్తూ సందర్శకులు ఇక్కడ కొంతసేపు గడుపుతున్నారు. వాటి పొడవైన మెడలు పైకి లేపి కొలనులో తిరుగుతున్నప్పుడు అవి పొడవులో పోటీపడినట్లు తలపిస్తుంటాయి.

కమనీయం.. అప్పన్న కల్యాణం


యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.